## పర వీర్య దానమా? దత్తతా?

**నాకు వీర్యంలో కణాలు లేవు. రావని చెప్పారు. డాక్టర్లు పరవీర్యదానం ద్వారా నా భార్యకు గర్భం కలిగించవచ్చని చెప్పారు. లేకపోతే ఎవరినైనా దత్తత తెచ్చుకో మన్నారు. ఏది మంచి దంటారు?**

**కె.సి., వెల్లటూరు**

జవాబు : రెండింటిలోనూ కొన్ని సాధక బాధకాలున్నాయి. మీ భార్యాభర్తలిద్దరూ యిష్టపడితే పర వీర్యదానమే మంచిదని మా ఉద్దేశ్యం.

దత్తత తెచ్చుకున్న బిడ్డ ఎన్నటికీ స్వంతం కాదు. మీ జీన్సు, మీ లక్షణాలు ఒక్కటి కూడా ఉండవు (మీ రక్త బంధు వుల బిడ్డ అయితే తప్ప). స్వంత అన్నదమ్ముల బిడ్డల్ని దత్తత చేసుకున్న వారు కూడా కొంతకాలం తర్వాత ఎరువు సరుకు బరువు చేటని, ఎక్కె డెక్కడి లక్షణాలో వచ్చిపడ్డాయని అకారణంగా విసుగుపడి, విలపించిన సందర్భాలు చాలా ఉన్నయ్.

దత్తత యిచ్చిన వారు ఏ వ్యామోహానికో లోబడి ఆ బిడ్డ కొత్త కుటుంబంలో ఇమడకుండా అడ్డుపడ్డ సందర్భాలు కోకొల్లలు. దత్తుపోయిన కుటుంబంలో పెరుగుతూ, కన్న తల్లిదండ్రుల పట్ల మమకారాన్ని పెంచు కుంటూ పెరిగిన పిల్లలూ చాలామంది ఉన్నారు.

అంత్యంలో అంతా క్షోభ మిగులు తుంది. అంతకన్నా ఏ అనాథ శరణాలయం నుంచో తెచ్చుకుని ఒక అభం శుభం ఎరుగని పసిప్రాణిని పెంచుకోవడం మంచిది. దత్తతంటూ చేసుకుంటే అదే మేలు. ఎటొచ్చీ బిడ్డ నెలల దైతేనే పూర్తిగా మీ పద్ధతుల్లో ఉంటుంది.

పరవీర్యదానం వల్ల బిడ్డ తల్లి గర్భంలో నవమాసాలూ పెరుగుతుంది. 50 % లక్షణాలు తల్లినుంచి పుణికి పుచ్చు కుంటుంది. సంతానం కోసం పరితపించే స్త్రీకి గర్భదారణ, ప్రసవం, స్తన్యమిచ్చి పెంచడం లాంటి మాతృత్వపు అనుభూతులన్నీ అనుభవం లోకి వస్తాయి. ఆమె తపన తీరుతుంది. బిడ్డను పరాయి బిడ్డగా ఎన్నటికీ ఆమె భావించదు. అది చాలా ముఖ్యం. ఆ కోరికలేవీ  దత్తత వల్ల తీరవు. ఆ పరిపూర్ణత లభించదు.

పరపురుషుని వీర్యమే అయినా సంపర్కంతో కూడుకున్నది కాదు కనుక ఇతరేతర భావాలు మనసుని వేధిం చాల్సిన పనిలేదు. సాధ్యమైనంత వరకూ డాక్టరు మీ లక్షణాలు (సుమారుగా) ఉన్న ఆరోగ్య వంతుణ్ణి ఎన్నుకుంటాడు. కనుక తెల్లని దంపతులకి నల్లటి బిడ్డ, నల్లటి వాళ్ళకి తెల్లటి బిడ్డ పుట్టి జీవితాంతం వెక్కిరించే విధంగా జరుగదు. వీర్యదాతనూ, గ్రహీతనూ రహస్యంగా ఉంచి ఎవరికీ సమస్యలు రాకుండా, ఎవరి మర్యాదకూ భంగం రాకుండా డాక్టరు కాపాడతాడు. కనుక వీర్యదానమే **(AID)** ఉత్తమం!

ఇది మా వ్యక్తిగత అభిప్రాయం సుమా! మంచి చెడ్డల వివేచన, నిర్ణయమూ మీవి!!